
మహిళా దినోత్సవం


సాక్షి పెద్దపల్లి


రేపటికి ముందడుగు

బుధవారం ၊ 8 ၊ మార్చి ၊ 2023









# అన్నింటా ఆమె..



ఆడపిల్లగా భువిపైకి వచ్చి..

అక్కగా ఆదరించి..

చెల్లిగా తోడుగా నిలిచి..

భార్యగా ఏడడుగులు నడిచి..

అమ్మగా లాలించి..

ఇల్లాలిగా ఇంటిని పాలించి..

భావి తరాలకు మార్గదర్శిగా నిలిచింది మహిళ

ఆమె అవని.. విశ్వానికి జనని.. ఆమె ఓపికకు వందనం. ఆమె లేనిదే జననం లేదు. ఈ ప్రపంచానికి మనుగడే లేదు. నాడు వంటింటికే పరిమితమై ఇల్లుదాటని మహిళ నేడు ఆకాశంలో సగం .. అవనిలో సగం అన్నట్లు సాగుతోంది. చదువులో అగ్రస్థానంలో నిలుస్తూ.. అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. అటెండర్ నుంచి ఐఏఎస్, ఐపీఎస్ బాధ్యతలు నిర్వహిస్తూనే.. ఇంటి బాధ్యతలను మరో చేతితో మోస్తోంది. ఇలా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. ఆడపిల్ల పుట్టిందంటే భయపడే నాటికాలం నుంచి మహాలక్ష్మిగా కొలుస్తున్నారు. ఊర్లో అమ్మాయి పుడితే ఆర్థికంగా అండగా ఉంటున్నారు పలువురు ప్రజాప్రతినిధులు.. ఓటమిని పట్టించుకోమంటూ... గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెబుతున్నారు నేటి యువత. నేడు మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు..!



## తాపీమేస్త్రీగా విజయ..

ఇంటి నిర్మాణ పనులను మగవారే కాదు.. తాము చేయగలమని నిరూపిస్తున్నారు పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌కు చెందిన గుంటి విజయ. 30 ఏళ్లుగా పెద్దపల్లి పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులు దక్కించుకుని దిగ్విజయంగా పూర్తి చేస్తున్నారు. తొలుత తాపీమేస్త్రీగా పనికి వెళ్లిన ఆమె పనిలో పరిణతి సాధించి.. ఇళ్లు నిర్మించే పనులను గుత్తాకు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఆమె ఓ పది మందికి పని కల్పిస్తున్నారు. పెద్దపల్లి, గౌరెడ్డిపేట, ముత్తారం గ్రామాల్లో ఎక్కువ ఇళ్లు నిర్మించారు. మూడేళ్ల క్రితం భర్త మరణించినా ఖాళీ లేకుండా వచ్చిన పని చేసుకుపోతున్నారు. – పెద్దపల్లిరూరల్

## మూగజీవాలకు నీటి వసతి



ధర్మారం అటవీ ప్రాంతంలో ప్రత్యేక గడ్డి విత్తనాలు సేకరించాం. వాటిని 8 హెక్టార్లలో నాటి కిలోమీటర్ల దూరం నుంచి సోలార్ ద్వారా బోరు పైప్‌లైన్ వేసి నీటిని అందిస్తున్నాం. ఇక్కడికి శాకాహార జంతువులైన జింకలు, దుప్పులు, కుందేళ్లు వస్తుంటాయి. డిగ్రీ వరకు చదువుకున్న. తల్లిదండ్రులకు అండగా ఉండాలని ఈ ఉద్యోగం సాధించా. వన్యప్రాణుల సంరక్షణే ధ్యేయంగా పని చేస్తున్న.

– స్వాతి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, ధర్మారం

## కలప రవాణా అడ్డుకుంటూ..



2009లో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా నియామకం అయ్యాను. ప్రస్తుతం డీవైఆర్‌వో సబ్బితంలో విధులు నిర్వహిస్తున్న. కలప రవాణా అడ్డుకునేందుకు రాత్రి కూడా విధులకు వెళ్లాల్సి ఉంటుంది. పర్యావరణాన్ని రక్షించే అటవీశాఖలో ఉద్యోగం చేయడం సంతోషంగా ఉంది. –మాధురి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ – సుల్తానాబాద్



అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారనడానికి పెయింటర్ గంగవ్వ ఉదాహరణగా నిలుస్తున్నారు. ఇళ్లకు రంగులు వేసే పనులు చేస్తూ జీవనోపాధి పొందడమేకాకుండా ఇంకొందరికి కూడా ఉపాధి చూపుతున్నానని గర్వంగా చెబుతున్నారు. కూలీ పనులకు వెళ్లే గంగవ్వ.. పెయింటింగ్ వైపు మళ్లారు గంగవ్వ. అప్పటినుంచి ఈమె పేరే పెయింటర్ గంగవ్వగా మారింది. ఇద్దరు కుమారు పెళ్లి చేసిన గంగవ్వ ప్రస్తుతం జిల్లాకేంద్రంలోని శాంతినగర్‌లో ఓ అద్దెగదిలో ఉంటున్నారు. పెయింటర్ గంగవ్వగా గుర్తింపు దక్కడంతోపాటు ఆర్థికంగానూ సంతృప్తి ఉందంటున్నారు గంగవ్వ. – పెద్దపల్లిరూరల్



సర్వేలో పాల్గొన్న రామగుండం మెడికల్ కళాశాల విద్యార్థులు

# అడుగు ముందుకే

## మహిళా సాధికారతే లక్ష్యం..

- అడుక్కోవడం కాదు హక్కుగా సాధించుకుంటాం..
- మహిళా చట్టాలు మరింత కఠినతరం చేయాలి
- సర్వేలో వివిధవర్గాల మహిళలు, యవతుల వెల్లడి

సాక్షి, పెద్దపల్లి: పురుషులతో సమాన హోదా.. నిర్ణయాలు తీసుకున్నప్పుడే మహిళాసాధికారత సాధ్యమని మహిళలు అంటున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా 100మంది మహిళలను 'సాక్షి' సర్వే చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ఆర్టీసీ, మెడికల్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు. మహిళా చట్టాలను కఠినం చేయడం, విద్యాసంస్థలు, పని ప్రదేశాల్లో వేధింపులు తగ్గాలన్నారు. వివక్షలేని సమాజంలో మరోసారి ఆడపిల్లలా పుట్టేందుకే ఆసక్తి చూపుతున్నారు.

## అమ్మాయినని ఎప్పుడూ ఫీల్‌కాలేదు



మాది నల్గొండ జిల్లా మిర్యాలగూడ. నాన్న బాలు. అమ్మ జ్యోతి. నాకు అక్క, తమ్ముడు ఉన్నారు. నాన్న వ్యవసాయం చేస్తుంటారు. ఇంట్లో నన్నే ఎక్కువ గారాబంగా చూస్తారు. ఫస్ట్ క్లాస్ నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివాను. మూడు నెలలపాటు కోచింగ్ గవర్నమెంట్ కాలేజీలో తీసుకున్న. నాన్నకు నన్ను డాక్టర్ చదించాలని కోరిక ఉండేది. రామగుండం మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. చాలా హ్యాపీగా ఉంది. అమ్మాయినని ఎప్పుడూ ఫీల్ కాలే. ఇంట్లో కూడా నాకు చాలా ఫ్రీడం ఇస్తారు. అందుకే చదువులో రాణిస్తున్న. నచ్చిన రీతిలో జీవితాన్ని లీడ్ చేస్తున్నా. – ధనావత్ సింధు, మెడికో

## తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..




మాది మంచిర్యాల. నాన్న చంద్రమోహన్. అమ్మ శ్రావణి. నాన్న సింగరేణిలో ఉద్యోగం చేస్తారు. అక్కను, నన్ను మా పేరెంట్స్ చదువులో రాణించాలని ఎంకరేజ్ చేస్తారు. అక్క బీటెక్ చదువుతోంది. ఇప్పుడు నేను ఎంబీబీఎస్ ఫస్టియర్. తల్లిదండ్రుల ప్రోత్సాహం చాలా ఉంది. సమాజంలోనూ మహిళల పట్ల సానుకూల దృక్పథం రావాలి. మగ, ఆడ వివక్ష తొలిగితే మహిళలు అన్నిరంగాల్లో రాణించగలరు. – ముద్దసాని సుస్మిత, మెడికో

## డాక్టర్ కావాలనేది నాన్న ఆశ



మాది నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట. నాన్న శ్రీనివాసులు ఆర్మీ రిటైర్డ్. అమ్మ రమావతి ప్రభుత్వ టీచర్. నాకో తమ్ముడు. నేను డాక్టర్ కావాలన్నది నాన్న ఆశ. ప్రజలకు నా ద్వారా ఉచితంగా వైద్యం అందించాలని కోరుకుంటున్నారు. నాకు ఫ్యాషన్ డిజైనర్ కావాలని అనిపించినా.. నాన్న కోరిక ప్రకారం డాక్టర్ చదువుతున్న. విద్యాసంస్థలు, పనిప్రదేశాల్లో మహిళలకు వేధింపులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. –ఎం. భవాని, మెడికో



వార్తను ఎడిటింగ్ చేస్తున్న జెడ్పీ సీఈవో ప్రియాంక

# 'సాక్షి' గెస్ట్ ఎడిటర్‌గా ప్రియాంక

- ఉమెన్స్ డే కథనాలను పర్యవేక్షించి ఫైనల్ చేసిన కరీంనగర్ జెడ్పీ సీఈవో
- కథనాల ఎంపిక.. పేజీ డిజైన్‌లో పలు సూచనలు
- యూనిట్ కార్యాలయంలో పలు విభాగాల సందర్శన
- పత్రిక రావడం వెనుక ఇంత శ్రమ ఉందా..! : ప్రియాంక

కరీంనగర్: కరీంనగర్ జిల్లా పరిషత్ సీఈవో ప్రియాంక మంగళవారం సాయంత్రం తిమ్మాపూర్‌లోని 'సాక్షి' యూనిట్ కార్యాలయాన్ని సందర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గెస్ట్ ఎడిటర్‌గా ఆహ్వానించగా.. సీఈవో హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్తా విశేషాలు, న్యూస్ ఎడిటింగ్ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా వచ్చిన ప్రత్యేక కథనాలను పరిశీలించారు. వార్తా కథనాల్లోని వ్యక్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. ఉద్యోగుల వివరాలు, ప్రింటింగ్ సమయం, ఏయే విభాగాల్లో ఎంత మంది ఉద్యోగులు ఉంటారనే విషయాలపై ఆరా తీశారు. పత్రిక మెయిన్ పేజీతో పాటు జిల్లాల పేజీలను ప్రింటింగ్ అయ్యే సమయంలో ప్లేట్స్‌ను ఎలా వినియోగిస్తారనే విషయాన్ని పరిశీలించారు. జిల్లా పేజీల కూర్పు, తదితర వివరాలపై 'సాక్షి' సిబ్బందితో మాట్లాడారు. 'ఎంతోమంది శ్రమిస్తే గాని పేపర్ బయటకురాదు. ప్రతిక్షణం సమాచారం అందించాలనే తపనతో పనిచేస్తుండడం బాగుంది. మహిళా దినోత్సవం ప్రత్యేక కథనాలు బాగున్నాయి. ఇతరులను ప్రభావితం చేసే అంశాలను ఎంచుకున్నారు..' అని అన్నారు. వార్తల సేకరణ.. ఎడిటింగ్.. పేజీ డిజైనింగ్‌పై అడిగి తెలుసుకున్నారు. పేజీ డిజైనింగ్‌ను పరిశీలించి.. హెడ్డింగ్ బాగుందని కితాబునిచ్చారు. మహిళా దినోత్సవం సందర్భంగా పత్రిక కార్యాలయాన్ని సందర్శించి వివిధ విభాగాల పనితీరును తెలుసుకోవడం సంతృప్తినిచ్చిందని చెప్పారు.



మహిళా దినోత్సవ కథనాలను పరిశీలిస్తూ..

# చదువు.. పోరాడు.. గెలువు

- ఇదే ఆమె వర్కింగ్ స్టైల్
- మున్నార్ నుంచి ఎంపికైన తొలి మహిళా ఐపీఎస్
- ఎక్కడ పనిచేసినా అక్కడ ప్రత్యేక గుర్తింపు
- విభిన్న శైలితో ముందుకెళ్తున్న సీపీ రెమా రాజేశ్వరి

'అధికారమెట్ల నీకు వస్తది..?
ఆత్మాభిమానం ఎట్ల మొలుస్తది..?
ఆశయం ఎట్ల ముందుకెళ్తది..?
సాధికారత సాధ్యమెట్లయితది..?..'

అని ప్రశ్నించుకునే ప్రతి మహిళకు ఆదర్శం.. ఆచరణీయం సీపీ రెమా రాజేశ్వరి. సమస్య ఏదైనా బాధితులు మాత్రం స్త్రీలు, పిల్లలే ఉంటారు. అందుకే ఆమె రూపొందించిన కార్యక్రమాలన్నీ మహిళలు, బాధిత కుటుంబాల శ్రేయస్సు కోరుతూ ఉంటాయి. మహిళా దినోత్సవం సందర్భంగా రాజేశ్వరిపై కథనం..

సాక్షి పెద్దపల్లి/గోదావరిఖని: మహిళా పోలీస్‌కు సరికొత్త నిర్వచనంగా నిలుస్తున్నారు సీపీ రెమా రాజేశ్వరి. ఆమె పుస్తక ప్రియురాలు, ఒక రైటర్, ఒక ఫొటోగ్రాఫర్, ఒక కాలమిస్ట్. నేరాల దర్యాప్తు, వాటి పరిష్కారంతో సరిపెట్టడం కాదు.. సమస్య మూలాలను ముందే పసిగట్టి ఆదిలోనే అడ్డుకట్ట వేయటం ఆమె స్టైల్. తాను పనిచేసిన అన్ని ప్రాంతాల్లో సామాజిక సమస్యలపై తనదైన మార్క్‌తో పోరాడి.. సమాజంలో మార్పునకు శ్రీకారం చుట్టి సత్ఫలితాలు సాధించారు. చిన్ననాట అమ్మమ్మ చెప్పిన కథలతో మున్నార్ నుంచి తొలి మహిళా ఐపీఎస్‌గా ఎన్నికై.. గన్నుతో ఒక్కపక్క శాంతిభద్రతలు పరిరక్షిస్తూనే.. పెన్నుతో సమాజంలోని వివిధ సమస్యలపై తనదైన శైలిలో కాలమ్స్ రాస్తున్నారు. ఎక్కడ పనిచేస్తే అక్కడి స్థానిక సమస్యలను అవగతం చేసుకోవడం.. వాటికి సరికొత్త పరిష్కారం చూపడంలో రాజేశ్వరికి ఉన్న విభిన్న శైలే ఆమెను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి.

### అమ్మమ్మ చెప్పిన కథలతోనే..

రెమా రాజేశ్వరి పుట్టింది కేరళ రాష్ట్రం మున్నార్ జిల్లా ఇడుక్కిలో. తండ్రి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో.. తల్లి టీచింగ్ ప్రొఫెషన్‌లో ఉన్నారు. కవల పిల్లలు కావడంతో అక్క తల్లిదండ్రుల వద్ద.. రాజేశ్వరి అమ్మమ్మ పార్వతి దగ్గర పెరిగారు. బ్రిటీష్ సివిల్ సర్వెంట్స్ సేద తీరేందుకు వచ్చినప్పుడు వారికి ఇచ్చే గౌరవం, మర్యాదలు చూసిన సంఘటనలను అమ్మమ్మ కథలుగా చెబుతూ 'నువ్వు కలెక్టర్ అవ్వాలి' అని చెప్పారు. ఎంజీ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్‌లో పీజీ చేసిన తర్వాత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తూ.. పోలీస్ మేనేజ్‌మెంట్‌లో పీజీతోపాటు సివిల్స్‌కి ప్రిపేరయ్యారు. మొదటి ప్రయత్నంలోనే 2009లో ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. ఏటూరునాగారంలో శిక్షణ పొందారు. మొదటి పోస్టింగ్ జగిత్యాలలో ఏఎస్పీగా. అనంతరం వివిధ జిల్లాలో ఎస్పీగా పనిచేశారు.

### విభిన్న కార్యక్రమాలతో గుర్తింపు

మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల గ్రామంలోని ఒక ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని కార్పొరేట్ వసతులు కల్పించేలా 'పోలీస్‌బడి'తోపాటు జోగిని వ్యవస్థ నిర్మూలనకు 'పున్నమి వెన్నెల' కార్యక్రమంతో 36 మంది జోగినులకు విముక్తి కల్పించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు 'రహదారి నేస్తం' పేరుతో స్థానిక సీనియర్ సిటిజన్స్ ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పించారు. 'సేవింగ్ చైల్డ్ బ్రైడ్' క్యాంపెయిన్ చేపట్టి 400 బాల్య వివాహాలను అడ్డుకున్నారు. 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్' ప్రోగ్రామ్స్ ద్వారా చిన్నారులను చైతన్యం చేయడానికి ప్రయత్నించారు. రంగారెడ్డి జిల్లాలో 'ఆపరేషన్ స్మైల్' ప్రోగ్రామ్‌తో వలస వచ్చిన బాలకార్మికులను బాడిబాట పట్టించారు. ఇందుకు ఆమె విస్తృతంగా సాహిత్యాన్ని చదవడమూ ఒక కారణం. తమిళం, మలయాళం, తెలుగు, పంజాబీ, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ



భాషల్లో ప్రావీణ్యం ఉన్న ఆమె.. పిల్లలు, స్త్రీల చుట్టూ ఉండే కథలే ఎక్కువ చదివారు.

### చదువుతోనే సాధికారత..

మహిళకు గౌరవం, డబ్బు కావాలంటే ముందుగా చదువుకోవాలని, దాని ద్వారానే స్త్రీలు మానసికంగా, ఆర్థికంగా బలోపేతమవుతారని తరుచూ చెప్తుంటారు. తాను టైమ్స్ ఆఫ్ ఇండియాకు రాసే కాలమ్స్‌లో సైతం టెక్నాలజీ, సోషల్ మీడియా, ఫ్రీ పీరియడ్స్, పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో జెండర్ ఈక్వేటీ, రాజకీయాల్లో మహిళలు, మీటూ ఉద్యమం, పని ప్రదేశాల్లో వేధింపులు తదితర సమస్యల పై వ్యాసాలు రాస్తూ, సమాజంలో రావాల్సిన మార్పుకు స్వాగతం పలుకుతున్నారు.




# మహిళలదే అగ్రస్థానం..

## నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- జిల్లాలో అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా ముందడుగు
- పాలన, కార్యనిర్వహణలో తమదైన ముద్ర

ఆమె శక్తి అపారం. యుక్తి అమూల్యం. ప్రేరణ అమోఘం. లాలన అద్భుతం. ధైర్యం అప్రతిహతం. సమాజంలో తల్లిగా.. చెల్లిగా.. ఆలిగా..అన్ని పాత్రలను ఒంటిచేత్తో జయించగల సత్తా మహిళామణుల సొంతం. ఆత్మవిశ్వాసంలో తమకు తామే సాటిగా.. సంకల్పశక్తి చాటడంలో అసాధారణ వ్యక్తిత్వం కలిగిన మహోజ్వల వనితగా ప్రత్యేకత చాటుతున్నారు జిల్లా మహిళలు. ఆత్మస్థైర్యంతో రాణిస్తున్న అతివలు.. అందరి అభిమానాన్ని చూరగొంటున్నారు. కట్టుబాట్లు అనే గొలుసులను తెంచుకుని.. అందివచ్చిన అవకాశంతో ఎదుగుతున్నారు. ప్రతికూలతలు ఉన్నా.. అనుకూలంగా మార్చుకుని దివిటీగా నిలుస్తున్నారు. వంటింట్లో గరిట తిప్పే దశ నుంచే అంతరిక్షంలో ప్రయోగాల వరకు.. ఇంటి ఆవరణను శుభ్రం చేసే స్థితి నుంచి సమాజంలో చెడు అనే తుప్పును వదిలించే వరకు.. భయంతో కుంగిపోయే స్థాయి నుంచి అభయమిచ్చేవరకు ముందుంటున్నారు.

| జిల్లాలో మహిళల ప్రాతినిధ్యం ఇలా.. | |
|---|---|
| మున్సిపల్ చైర్పర్సన్లు | 3 |
| సర్పంచులు | 133 |
| ఎంపీపీలు | 07 |
| జెడ్పీటీసీ సభ్యులు | 07 |
| కార్పొరేటర్లు | 25 |
| కౌన్సిలర్లు | 30 |

సాక్షి, పెద్దపల్లి: ఆకాశంలో సగం.. అన్నిట్లోనూ మనం అనే నినాదాన్ని అందిపుచ్చుకున్నట్లు.. పాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో కలెక్టర్ సంగీత ఒకవైపు.. శాంతిభద్రతలు రక్షించటంలో సీపీ రెమా రాజేశ్వరి మరోవైపు దూసుకుపోతున్నారు. పాలన, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో పురుషులకు దీటుగా మహిళలు జిల్లాలో ముందడుగు వేస్తున్నారు. పారిశ్రామికప్రాంతమైన జిల్లాలో మహిళల హవా కొనసాగుతోంది. ఇటు ప్రజాప్రతినిధులుగా.. అటు ఉద్యోగులుగా పాలనారంగంలో వారిదే అగ్రస్థానం. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు ముగ్గురు మహిళలే చైర్పర్సన్లుగా ఉన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ముందుంటూనే.. ప్రజల అవసరాలకు తగినట్లు కృషి చేస్తున్నారు.

**కీలక స్థానాల్లో మహిళలే..**

డీఈవోగా మాధవి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారిగా కల్పన, మంథని మున్సిపల్ కమిషనర్‌గా శారద, సబ్ రిజిస్ట్రార్లుగా నిర్మలరెడ్డి, ప్రియాంకరెడ్డి, అడిషనల్ డీఆర్‌డీవో సునీత, మెప్మా పీడీగా రజినీ, అడిషనల్ డీఎంహెచ్‌వోగా కృపాబాయ్ పాలనలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

**మద్దతిస్తే మరింత ముందుకు**

జిల్లాలో ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో అత్యధికులు రాజకీయ అనుభవం లేనివారే. కొన్నిచోట్ల వారి భర్తలే కీలకంగా వ్యవహరిస్తున్నారు. కొందరు మాత్రం సొంత నిర్ణయాలతో దూసుకెళ్తున్నారు. మంథని, పెద్దపల్లి మున్సిపల్ చైర్పర్సన్లు పుట్ట శైలజ, దాసరి మమతరెడ్డి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ.. తమతోపాటు ఎన్నికైన ఇతర ప్రజాప్రతినిధులకు మోడల్‌గా నిలుస్తున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుంటున్న చాలామంది భర్తచాటుగా కాకుండా పాలనలో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు.

### ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



అమ్మాయిలు తాము ఎంచుకున్న రంగాన్ని సాధించేందుకు కృషి చేయాలి. ఇతర అంశాల వైపు డైవర్ట్ కాకుండా ఫోకస్‌గా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. అప్పుడే విజయం సొంతమవుతుంది. చదువు ద్వారా మాత్రమే మహిళలు ఆర్థికంగా, మానసికంగా ఉన్నత స్థానాలకు చేరుకోగలరు. అప్పుడు వారితోపాటు, వారి కుటుంబాన్ని కూడా చూసుకోగలరు. సమాజంలో జరుగుతున్న సంఘటనలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలి.

– సంగీత, కలెక్టర్

### అక్షరజ్ఞానంతోనే మహిళాచైతన్యం



పెద్దపల్లిరూరల్: ప్రతి మహిళా చదువుకోవాలి. అప్పుడే చైతన్యం వస్తుంది. ఇప్పటికే మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా రాణిస్తున్నారు. పల్లెప్రాంత మహిళలు అక్షరాస్యత వైపు దృష్టి సారించాల్సిన అవసరముంది. చదువుతోనే సమాజంలో ఉన్నత స్థితికి చేరడం సాధ్యపడుతుందనే విషయాన్ని గుర్తుంచుకుని ప్రతిఒక్కరూ చదువు నేర్చుకోవాలి.

– డాక్టర్ మమతారెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ పెద్దపల్లి

### ధైర్యంతో ముందుకెళ్లాలి



మంథని: జీవిత గమనంలో అనేక ఒడిదొడుకులు వస్తుంటాయ్. వాటిని అధిగమించి ధైర్యంతో ముందుకెళ్తేనే విజయం సొంతమవుతుంది. సాధికారత సాధించాలంటే ఆత్మవిశ్వాసం అవసరం. ప్రభుత్వం మహిళల అభివృద్ధికి చేస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి. ఎంపీటీసీ, సర్పంచ్, చైర్పర్సన్‌గా ఎదగడానికి నాకు అనేక ఆటంకాలు ఎదురయ్యాయి. ఎక్కడా మనోధైర్యం కోల్పోలేదు. అందుకే ప్రజలకు ఆదర్శవంతమైన పాలనకు అవకాశం కల్గింది.

– పుట్ట శైలజ, మున్సిపల్ చైర్పర్సన్, మంథని

### చైతన్యంతో ఏదైనా సాధ్యమే..



సుల్తానాబాద్: ఇప్పుడున్న సమాజంలో మహిళలకు చైతన్యం ఎంతో అవసరం. చదువుతోనే మహిళలకు గౌరవం. మున్సిపాలిటీగా ఆవిర్భవించిన మొదటిసారే చైర్పర్సన్‌గా అవకాశం వచ్చింది. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకుని ప్రజలకు సేవ చేస్తున్న. ఇప్పుడు మహిళలు అన్నిరంగాల్లోనూ రాణిస్తున్నారు. సొంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రగతికి బాటలు వేస్తున్నారు. మహిళలు విద్యావంతులు అయితేనే సమష్టి నిర్ణయాలు తీసుకునే అధికారం పొందే అవకాశముంది.

– ముత్యం సునీత, మున్సిపల్ చైర్పర్సన్ సుల్తానాబాద్



## సీఎం నిర్ణయంతో ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకం

- మావోయిస్టు జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్

మంథని: సీఎం కేసీఆర్ నిర్ణయంతో ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని మావోయిస్టు పార్టీ జయశంకర్, భూపాలపల్లి–మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి(జేఎండబ్ల్యూపీ) డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడం ఆదివాసీల వినాశనానికి దారితీస్తుందన్నారు. మైదాన ప్రాంతాలతో పోలిస్తే ఆదివాసీల సామాజిక పద్ధతులు, ఆచార వ్యవహారాలు, వారి జీవన విధానం భిన్నంగా ఉంటాయని పేర్కొన్నారు. చట్టాలను అమలు చేయకపోవడంతో ఏజెన్సీలోకి ఆదివాసీయేతరులు ప్రవేశించి, భూములు ఆక్రమిస్తున్నారని తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, ఆదివాసీలు సీఎం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేవరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

## కూనారంవాసిని హతమార్చింది మేనల్లుడే

- సీసీ కెమెరాల సాయంతో నిందితుడి పట్టివేత
- వివరాలు వెల్లడించిన డీసీపీ వైభవ్ గైక్వాడ్

పెద్దపల్లిరూరల్: భిక్షాటన చేస్తుండటం వల్లే తనకు పెళ్లి కుదరడం లేదని భావించి, మేనమామ మారుపాకల రాయమల్లు (49)ను అతని అల్లుడే హతమార్చాడని డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కూనారం గ్రామానికి చెందిన రాయమల్లు రామగిరి మండలంలోని సెంటినరీకాలనీలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని మేనల్లుడు చిప్పగుర్తి శివ ఆటో నడుపుతూ ఉపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో కొద్ది రోజులుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు. అయితే మేనమామ భిక్షాటన చేస్తుండటం వల్లే తనకు సంబంధాలు కుదరడం లేదని అనుకున్నాడు. అతన్ని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 4న పెద్దపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోకి రాయమల్లును ఆటోలో తీసుకువచ్చాడు. కర్రతో విచక్షణారహితంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మొదట గుర్తు తెలియని మృతదేహమని కేసు నమోదు చేసిన పోలీసులు తర్వాత సీసీ కెమెరాలను పరిశీలించి, రాయమల్లు అల్లుడే హంతకుడని తేల్చారు. అతన్ని అదుపులోకి తీసుకొని, విచారణ చేపట్టారు. నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేసినట్లు డీసీపీ పేర్కొన్నారు.



గొరెడ్డిపేట పల్లె ప్రకృతి వనంలో మృతదేహాన్ని పూడ్చిన చోటు

**పల్లె ప్రకృతి వనంలో మృతదేహం పూడ్చివేత**

పెద్దపల్లి మండలంలోని గొరెడ్డిపేట పల్లె ప్రకృతి వనంలో మృతదేహాన్ని పూడ్చివేశారని ఉపాధి కూలీలు తెలిపారు. అది రాయమల్లు మృతదేహమేనని తెలిసింది. పోలీసులు మృతుడి బంధువులకు అప్పగించగా అంత్యక్రియలు నిర్వహించే స్థోమత లేక వారు ప్రకృతి వనంలో పూడ్చివేశారని సమాచారం. దీనిపై కూలీలు ఆందోళన చెందుతున్నారు. మృతదేహాన్ని పూడ్చిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, బయటకు తీసి, మరోచోట పూడ్చాలని కోరుతున్నారు.



### కమిషనరేట్‌లో హోలీ వేడుకలు



గోదావరిఖని(రామగుండం): రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ రెమా రాజేశ్వరి పోలీసు అధికారులతో కలిసి హోలీ ఆడారు. అధికారులు, ఉద్యోగులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్, పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్, గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, జైపూర్ ఏసీపీ నరేందర్, మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, స్పెషల్ బ్రాంచి ఏసీపీ మోహన్, సీసీఎస్ ఏసీపీలు వెంకటేశ్వర్లు, ఉపేందర్, ఏఆర్ ఏసీపీలు సుందర్‌రావు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

### 'ఉపాధి' పనులు పరిశీలించిన శిక్షణ ఐఏఎస్‌లు



జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని కుమ్మరికుంటకు గ్రామ స్థాయి శిక్షణ నిమిత్తం వచ్చిన ఐఏఎస్‌లు మంగళవారం ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వేతనం, పనులకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షణ ఐఏఎస్‌లు అభిజిత్ శర్మ, నితీశ్‌మిశ్రా, కమలేశ్ కుమార్, మిహిర్, రాహుల్, సర్పంచ్ సంతోష్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు మల్లేశ్‌యాదవ్, ఎంపీవో కిరణ్, ఏపీవో సదానందం, టీఏ శ్రీకర్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి అంజలిదర్ తదితరులు పాల్గొన్నారు.